క్లుప్తంగా

పేదల వైద్యానికి భరోసా

మానకొండూర్ ఎమ్మెల్యే



బెజ్జంకి(సిద్దిపేట): బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

బెజ్జంకి(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్): పేదప్రజలకు వైద్య సదుపాయం కల్పించేందుకే సీఎంఆర్ఎఫ్ పథకం నుంచి నిధులను మంజూరు చేస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన 37మంది లబ్ధిదారులకు రూ.10.76లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఆయన వెంట నాయకులు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండపాక మండల పరిధిలోని దుద్దెడలో ఐదుగురు లబ్ధిదారులకు రూ.90వేల విలువైన చెక్కులను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, నాగరాజు, భాను, రాకేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

ఏపీఎం విజయనిర్మల



కోళ్లను అందజేస్తున్న విజయనిర్మల

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నాటుకోళ్ళ పెంపకాన్ని పోత్సహిస్తోందని ఏపీఎం విజయనిర్మల అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నాటుకోళ్ళ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నాటుకోళ్ల పెంపకానికి ఆసక్తి కలిగిన మహిళా సంఘాలకు 3,045 నాటుకోళ్ళను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు రాజయ్య, రాజమల్లయ్య, భాగ్య, సంధ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

రహస్యంగా టెండర్లా?



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: బతుకమ్మ టెండర్ల ప్రక్రియను రహస్యంగా నిర్వహించడటంలో అంతర్యమేమిటని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. పట్టణ ఉపాధ్యక్షుడు రాంప్రసాద్ ఇతర నాయకులతో కలిసి శుక్రవారం మాట్లాడారు. టెండర్ నిబంధనలు పాటించకుండా మున్సిపల్ అధికారులు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా నోటిఫికేషన్ విడుదలచేసి టెండర్‌కు ఆహ్వానించాల్సి ఉందని, బయటి కాంట్రాక్టర్లు రాకుండా లోకల్ కాంట్రాక్టర్లు అడ్డుకుంటూ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కౌన్సిలర్లకు లాభం చేకూర్చేందుకే టెండర్ ప్రక్రియను రహస్యంగా పూర్తి చేశారని, టెండర్ ప్రక్రియలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భూశంకరాచారి, అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ ట్రాన్స్‌ఫార్మర్లు



చెల్లాపూర్‌లో పొదల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో పలు ట్రాన్స్‌ఫార్మర్ల పరేషాన్ చేస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి ఫెన్సింగ్ లేకపోవడం, దానికి తోడు పిచ్చి మొక్కలు, పొదలు ఏపుగా పెరిగి అవి కనిపించక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల చెల్లాపూర్‌లోని ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, మరో వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. దీనిపై కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ చెల్లాపూర్‌లో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని విద్యుత్, మున్సిపల్ అధికారులకు విన్నవించారు.



కొండపాక(గజ్వేల్): మర్పడ్గలోని క్షేత్రంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సుభాష్ రోడ్డులోని మండపంలో అమ్మవారు

గాయత్రి దేవిగా అమ్మవారు

దేవిశరన్నవరాత్రోత్సవాలు జిల్లాలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాలలోని శుక్రవారం అమ్మవారు భక్తులకు గాయత్రిదేవిగా దర్శనం ఇచ్చారు. మండపాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. కొండపాక మండలంలోని మర్పడ్గలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. పల్లకిని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. అమ్మవారు గాయత్రి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత్‌నగర్‌లో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



చిన్నకోదూరు(సిద్దిపేట):పెద్దకోదూరులో..



మిరుదొడ్డి(దుబ్బాక):మిరుదొడ్డిలో పూజలు చేస్తున్న భక్తులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత్‌నగర్‌లో బతుకమ్మలు ఆడుతున్న మహిళలు

'బతుకమ్మ' సంబరాలు

బతుకమ్మ పండుగ ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు బతుకమ్మను జిల్లా ప్రజలు అత్యంత వైభవంగా ఆడిపాడారు. జిల్లా కేంద్రం పట్టణాలు, గ్రామాల్లో వీధి, వీధిలో మహిళలు ఒకచోట చేరి శుక్రవారం జానపద గేయాలు పాడుతూ ఆటలు ఆడారు. వాడవాడా బతుకమ్మ పాటలతో హోరెత్తింది. ముద్దపప్పును నైవేద్యంగా సమర్పించారు.



హుస్నాబాద్: కోర్టు ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న జడ్జి శివరంజని తదితరులు



సిద్దిపేటరూరల్: అంగన్‌వాడీలో బతుకమ్మలతో చిన్నారులు, మహిళలు



సిద్దిపేటఅర్బన్: బతుకమ్మలతో యువతులు, ఉపాధ్యాయులు

ఒకే కార్డుతో సేవలన్నీ పొందొచ్చు

ఆర్డీఓ బన్సీలాల్



వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

కొండపాక(గజ్వేల్): సేవలన్నీ ఒకే కార్డుద్వారా పొందేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే చేపట్టిందని ఆర్డీఓ బన్సీలాల్ తెలిపారు. కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ గ్రామంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఈఓ మూడు టీంలుగా చేపట్టిన సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన సర్వేను పూర్తిస్థాయిలో సమగ్రంగా పూర్తిచేయాలన్నారు. సర్వేలో తప్పిదాలు చోటుచేసుకోకుండా వాస్తవాలను తెలియజేయాలని కోరారు. మరో మూడు రోజులలోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్వే టీం సభ్యులు పాల్గొన్నారు.

చెడువ్యసనాలకు బానిసలు కావొద్దు

సీఐ సైదా



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సైదా

గజ్వేల్‌రూరల్: చెడువ్యసనాలకు బానిసలు కావొద్దని, విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని సీఐ సైదా సూచించారు. పట్టణంలోని బీఎంఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు చెప్పే పాఠాలను శ్రద్ధగావిని చదువుల్లో రాణించాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని చెప్పారు. సెల్‌ఫోన్‌లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది శ్యామల, రామచంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ట్రాఫిక్ సీఐ మురళి సూచించారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో 33వ సంగారెడ్డి బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ పీఎంఎస్‌రావు, సుబేదార్ మేజర్ రామ్‌హరి, ఏఎన్ఓ లెఫ్టినెంట్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం అధికం

వ్యవసాయ అధికారి శ్రీనాథ్



విత్తనోత్పత్తి వరిని పరిశీలిస్తున్న శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ సూచించారు. మండల పరిధిలోని బక్రిచెప్యాల, రంగధాంపల్లిలో వరి, జీలుగ పంటలను శుక్రవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటను సాగు చేయడానికి 45రోజుల ముందు జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి వాటిని పెంచి పూతదశలో భూమిలో కలియదున్నడంతో పంటకు ప్రధాన పోషకాలు ఎక్కువ మొత్తంలో అందుతాయన్నారు. దాని ద్వారా ఎరువుల వినియోగాన్ని కూడా తగ్గించుకోవచ్చని చెప్పారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని చెప్పారు. ఆయన వెంట ఏఈఓలు రాజేశ్, పవన్ ఉన్నారు.

అభివృద్ధి పనుల కోసం వినతి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ జాతీయ కార్యదర్శి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం బెజ్జంకి మండల నాయకులు కలిసి అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. దీంతో ఆయన స్పందించి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద నిత్యాన్నదానానికి షెడ్డును త్వరలోనే నిర్మిస్తామని, బస్‌లు నడిపేందుకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, అజయ్ వర్మ, పార్టీ మండల అధ్యక్షుడు రాజు, సంగ రవి, సాయిలు, భాస్కర్‌రెడ్డి, కిషన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విలువలు కాపాడడం అందరి బాధ్యత

సిద్దిపేటకమాన్: నైతిక విలువలు కాపాడడం అందరి బాధ్యత అని జమాయితే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఖలేద్ ముబషీర్ ఉజ్‌జఫర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమాత్ ఎ ఇస్లామి హింద్ దేశంలో 75 యేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. నైతిక విలువలను ప్రోత్సహించడానికి, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దృఢవైఖరి తీసుకోవాలని కోరారు. సమావేశంలో నయియొద్దీన్, అలీమొద్దీన్, ఇర్షద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సెలవులు

డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు 6 నుంచి 13వరకు మొదటి విడత సెలవులను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ సెలవు రోజుల్లో తరగతులను నిర్వహించవద్దని, అన్ని కళాశాలల యాజమాన్యాలు విధిగా సెలవులను పాటించాలని చెప్పారు. నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా విధించి, కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని వెంకటాపూర్‌లో మాజీ సర్పంచ్ ఎర్ర యాదమ్మ ఎనిమిదో వర్ధంతి సందర్భంగా శుక్రవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారి కుమారులు ప్రకాశ్, విజయ్ కుమార్, ఈశ్వరయ్య మాట్లాడుతూ 1995 నుంచి 2001వరకు యాదమ్మ సర్పంచ్‌గా కొనసాగారన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దేవేందర్ రెడ్డి, లక్ష్మి మల్లయ్య, రాజమహమ్మద్, ఎల్లయ్య, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్, షేక్ దస్తగిరి పాల్గొన్నారు.

టెలికామ్ బోర్డు మెంబర్‌గా మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక): టెలికామ్ బోర్డు మెంబర్‌గా మండల కేంద్రానికి చెందిన మల్లేశం నియామకమయ్యారు. ఆయన గతంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో చురుగ్గా పాల్గొన్నారు. అలాగే బీఎంఎస్ కార్మిక సంఘం నాయకుడిగా, బీజేపీ మండల అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా అనేక బాధ్యతలను నిర్వర్తించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తా

జగదేవ్‌పూర్(గజ్వేల్): మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు తను సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర కోశాధికారి, జగదేవ్‌పూర్ ది మాస్టర్ మైండ్ పాఠశాల కరస్పాండెంట్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఒకరు కూడా పోటీచేయడం లేదన్నారు. పటాన్‌చెరులో డీసీసీబీ డైరెక్టర్‌గా, పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేసిన రాజకీయ అనుభవం ఉందని చెప్పారు. పట్టభద్రులు ఆన్‌లైన్‌లో 11లోగా ఓటును నమోదు చేసుకోవాలని, అన్ని జిల్లాల్లో త్వరలోనే పర్యటిస్తానని తెలిపారు. ట్రస్మా సభ్యులు చంటి, కరుణకర్‌రెడ్డి మహేశ్, రామస్వామి పాల్గొన్నారు.

అల్లీపూర్ సొసైటీ ఎదుట ధర్నా

చైర్మన్, సీఈఓలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోదూరు(సిద్దిపేట): అల్లీపూర్ కో–ఆపరేటీవ్ సొసైటీలో తప్పుడు బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేసిన చైర్మన్, సీఈఓలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ సొసైటీలో రైతులకు ఇచ్చిన రుణం రికవరీ చేసినా వాటిని క్లోజ్ చేయకుండా నోటీసులు ఇస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడుతూ రైతులను ముంచుతున్నారని, విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు జయంత్, గణేశ్, రాజు, ప్రశాంత్, భూపతిరెడ్డి, సంపత్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాడులను ఖండిస్తూ న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుస్నాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులను టార్గెట్ చేస్తూ పోలీసులు దాడి చేయడాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ ఖండించారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఖలీమ్‌పై పోలీసులు దాడిచేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సిద్దిపేట, చేర్యాల, సిరిసిల్ల, హన్మకొండలోను ప్రస్తుతం హైదరాబాద్‌లోను పోలీసులు దాడిచేయడం సరికాదన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. పోలీసుల ఆగడాలు ఎక్కువయ్యాని, కొత్త చట్టాలు కూడా వారికే అనుకూలంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మల్లేశం, హన్మయ్య, రామకృష్ణ, ప్రవీణ్, దేవేందర్, సంపత్, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

భౌతిక, ఆర్థిక శాస్త్రాల్లో డాక్టరేట్‌లు



పట్టా అందుకుంటున్న సంపత్, రమేశ్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన పిడిశెట్టి సంపత్ సీఈఐఎస్ఆర్ యూజీసీ నెట్‌లో ఆలిండియా 87వ ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. సంపత్ సీనియర్ ప్రొఫెసర్ డి.కరుణసాగర్ ఆధ్వర్యంలో ఈ పట్టా సాధించారు. ఆయన వరుసగా ట్రైబల్ వెల్ఫేర్‌లో టీజీటీ,–సైన్స్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి గ్రేడ్–2తో పాటు మైనారిటీ గురుకుల సొసైటీలో ప్రిన్సిపాల్‌గాను మూడు ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం తిమ్మాపూర్‌లోని మానకొండూర్ మైనారిటీ గురుకులంలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే కాకతీయ విశ్వవిద్యాయలం ఆర్థిక విభాగ పరిశోధనలో మండల కేంద్రానికి చెందిన జాలిగం రమేశ్ డాక్టర్‌రేట్ పొందారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్.విజయ పర్యవేక్షణలో పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. రమేశ్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

సమాజంపై అవగాహన అవసరం

సిద్దిపేటకమాన్: ఉపాధ్యాయులకు సమాజంపై లోతైన అవగాహన ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య సూచించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లాస్థాయి అధ్యయన తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం సూచనలు చేస్తూ ప్రభుత్వానికి నివేదికను అందించామని చెప్పారు. టీఎస్ యూటీఎఫ్ ప్రతి కార్యకర్త ప్రభుత్వ పాఠశాలల కోసం నిరంతరం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు

ఏసీపీ మధు



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ మధు

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): గుర్తుతెలియని వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్ నగర్ డబల్ బెడ్రూం కాలనీలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీలలోని పలు ఇళ్లను పరిశీలించారు. కాలనీలో నూతనంగా ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తారని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా నిర్భయంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులను ఓపెన్ చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ఉపేందర్, ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, రాజేశం, పోలీసులు పాల్గొన్నారు.